




ఈవో రామారావు ఆధ్వర్యంలో అమ్మవారికి తొలిసారె తీసుకెళ్తున్న ఆలయ సిబ్బంది



నిండుకుండలా పోలవరం కాల్వ (ఇన్‌సెట్‌లో) రంగన్నగూడెంలో గోదావరికి పూజలు చేస్తున్న నీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ

గలగలా గోదారి

పట్టిసీమ నుంచి పరుగులు పెడుతున్న గోదావరి

- పోలవరం కాల్వ మీదుగా కొత్తూరు తాడేపల్లి వరకూ..
- నేడు పవిత్ర సంగమానికి..
- ఇప్పటి వరకు 0.8 టీఎంసీల నీరు లిఫ్ట్
- రైతుల మోముల్లో చిగురిస్తున్న ఆశలు
- ప్రకాశం బ్యారేజీకి ఇక జలకళ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పట్టిసీమ నుంచి గోదావరి పరవళ్లు తొక్కుతోంది. పోలవరం కాల్వ మీదుగా కృష్ణానదిలో కలిసేందుకు పరుగులు పెడుతోంది. పట్టిసీమ వద్ద ఈనెల 3వ తేదీన 21 పంపులను ఆన్ చేసి వదిలిన నీరు ఆదివారం పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలోకి చేరనుంది. 8500 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేయాలని నిర్ణయించారు. అయితే, కాల్వల పరిస్థితిని అంచనా వేసుకుని పంపులను ఆన్ చేస్తున్నారు. ఇప్పటి వరకు కృష్ణానదిలోకి 0.8 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టాన్ని, పోలవరం కాల్వ పరిస్థితిని అంచనా వేసుకుని ఆ పంపులను కుదించారు. మొత్తం 17 పంపులు ఇక్కడ పనిచేస్తున్నాయి. ప్రస్తుతం 6018 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి నీరు శనివారం నాటికి విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి వరకు చేరుకుంది. మరో రెండు రోజుల్లో పవిత్ర సంగమం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది.

రైతుల్లో ఆనందం

పట్టిసీమ నుంచి నీరు వస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు సమాయత్తమవుతున్నారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్కసారి మాత్రమే పట్టిసీమ నుంచి నీటిని తీసుకుంది. కాగా, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు నీరు ఇవ్వలేకపోవడంతో రైతులు అధికారులను నిలదీస్తున్నారు. దీంతో జలవనరుల శాఖ అధికారులు సైతం పట్టిసీమ నీటిపైనే ఆశలు పెట్టుకున్నారు.

తూర్పు డెల్టాకు పండగే..

ప్రకాశం బ్యారేజీ వద్ద ప్రస్తుత నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు. ప్రస్తుతం ఇక్కడ రెండు టీఎంసీల నీరే అందుబాటులో ఉంది. ఈ నీటిని కృష్ణాడెల్టా, గుంటూరు జిల్లాలోని పశ్చిమ డెల్టాకు అందజేయాలి. ఈ రెండు జిల్లాల్లోనూ జూన్ ముగిసి జూలై వచ్చిన వ్యవసాయ పనులు ఊపందుకోలేదు. ఇక బ్యారేజీ వద్ద నీటిమట్టం తగ్గుతున్నప్పుడు ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుంచి నీటిని తీసుకునే అవకాశం ఉంది. ఇప్పుడు ఆ ప్రాజెక్టులోనూ నీటిమట్టం దారుణంగా పడిపోయింది. బ్యారేజీకి దిగువన ఉన్న తూర్పు డెల్టాలో మొత్తం 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక్కడ ఖరీఫ్‌లో సాగుకు 155.40 టీఎంసీల నీరు అవసరమవుతుంది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు, పులిచింతల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 45.77 టీఎంసీలు. ఇందులో ప్రస్తుతం 4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ ఏడాది ఎగువ నుంచి ఇన్‌ఫ్లో రాకపోవడంతో సాగునీటి సమస్య ఏర్పడింది.

తొలిసారె తెస్తిమమ్మా..

ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు ప్రారంభం

- తొలిసారె సమర్పించిన ఆలయ సిబ్బంది
- కనకదుర్గానగర్ నుంచి ఊరేగింపుగా అమ్మ సన్నిధికి..
- వారాహి నవరాత్రులకు శ్రీకారం

8లో..



దుర్గమ్మ ఉత్సవమూర్తి

ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక సిబ్బంది, పరిపాలన సిబ్బంది, వారి కుటుంబసభ్యులు అమ్మవారికి తొలిసారె సమర్పించారు. కనకదుర్గానగర్ నుంచి ఊరేగింపుగా సారెను తెచ్చి, అమ్మకు సమర్పించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది ప్రత్యేకంగా వారాహి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఈనెల 15వ తేదీ వరకూ జరిగే ఉత్సవాలను శనివారం ప్రారంభించారు.



అమ్మ వేషధారణలో చిన్నారి

విషంచిమ్మి.. నిషేధం



గుడివాడలో 445.75 ఎకరాల్లో భారీ మిడిల్ ఇన్‌కం గ్రూపు (ఎంఐజీ) ఇళ్లు నిర్మిస్తామని నమ్మబలికారు. తక్కువ ధరకే భూములు ఇవ్వాలని రైతులను బెదిరించారు. భూసేకరణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసే సొమ్మును ఎలాగైనా దోచేయాలనుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, జాయింట్ కలెక్టర్ మాధవీలతారెడ్డి వేసిన ఈ స్కెచ్‌ను రైతులు తిప్పికొట్టారు. భూములివ్వడానికి ససేమిరా అన్నారు. కక్షకట్టిన గడ్డం గ్యాంగ్ ఆ భూములను నిషేధిత జాబితాలో చేర్చింది. ఫలితంగా నాటి నుంచి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పాటైన టీడీపీ కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

గుడివాడలో 400 మంది రైతులపై కొడాలి నాని కక్ష



నిషేధిత జాబితాలో ఉన్న రైతుల భూములివే..

- గత వైసీపీ హయాంలో తెరపైకి ఎంఐజీ ప్రాజెక్టు
- అడిగిన ధరకు భూములివ్వాలని రైతులపై కొడాలి నాని, పేర్ని నాని పట్టు
- సహకరించిన అప్పటి జేసీ మాధవీలతారెడ్డి
- ధర సరికాదని తిరస్కరించిన రైతులు
- కక్షతో ఆ భూములపై నిషేధం విధింపు
- ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

ఎటువంటి లావాదేవీలు జరక్క అవస్థలు

కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని వినతి

గుడివాడ : 2021లో గుడివాడలో భారీ ఎంఐజీ ప్రాజెక్టు చేపడుతున్నామని అప్పటి మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని, జాయింట్ కలెక్టర్ మాధవీలతారెడ్డి ప్రకటించారు. దీనికోసం పట్టణానికి ఆనుకుని ఉన్న వలివర్తిపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని 86 సర్వే నెంబర్లలో సుమారు 400 మంది సన్న, చిన్నకారు రైతులకు చెందిన 445.75 ఎకరాల భూమిపై కన్నేశారు. వెంటవెంటనే ఫైల్ సిద్ధం చేసేశారు. ఈ భూమికి సంబంధించిన రైతులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో అప్పటి జాయింట్ కలెక్టర్, ఎమ్మెల్యే నానీలు కసరత్తు చేశారు. వారంవారం సమీక్షా సమావేశాలు నిర్వహించి హంగామా సృష్టించారు.

రైతులను బెదిరించి..

ఎంఐజీ ప్రాజెక్టు ఎక్కడ చేపట్టాలనే పక్కా ప్లాన్‌తోనే కొడాలి నాని తన అనుచరగణంతో అక్కడి భూములను కొనడానికి ప్రయత్నించారు. అయితే, తమకు జీవనాధారమైన పొలాలను వదులుకునేందుకు రైతులు ఇష్టపడలేదు. వ్యక్తిగత అవసరాలకు కొందరు అమ్ముకోగా, మరికొందరు ససేమిరా అన్నారు. నాని అనుచరగణం చెల్లిస్తామన్న, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ధరకు తమకు సమ్మతం కాదని తేల్చిచెప్పారు. అయినా గడ్డం గ్యాంగ్ వారిపై ఒత్తిడి తెచ్చారు. పలువురిని బెదిరించి, కొనుగోలు కాంట్రాక్టు పత్రాలు రాయించుకున్నారు. కొందరితో బలవంతంగా సంతకాలు తీసుకున్నారు. మిగిలిన రైతులు.. భూధరను పెంచాలని పలుమార్లు అధికారులకు వినతులు అందించారు. అయితే, అవేమీ పట్టించుకోని గడ్డం గ్యాంగ్ భూసేకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే మూడింతల సొమ్మును కాజేయాలనే ప్లాన్ వేసింది.

పక్కా ప్లాన్‌తో..

నాటి జిల్లా మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, జిల్లా జాయింట్ కలెక్టర్ మాధవీలతారెడ్డి సహకారంతో భారీస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ సొమ్మును దోచుకోవాలని పక్కా ప్రణాళిక వేసుకున్నారు. ప్రాజెక్టు చేపట్టే ప్రాంతంలో భూములను కొనాలని, భూసేకరణ ద్వారా మూడింతల సొమ్మును కాజేయాలని, వచ్చిన మొత్తాన్ని ముగ్గురూ పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. నాని తన అనుచరులతో ఎంఐజీలోని 150 ఎకరాలు కొనడానికి సిద్ధమయ్యారు. అయితే, రైతుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో ప్రాజెక్టును అమాంతంగా అటకెక్కించారు. పట్టణ ప్రజలకు ఆసక్తి లేదని అప్పటి మున్సిపల్ కమిషనర్ ద్వారా లేఖ పెట్టించి ప్రాజెక్టును తుంగలో తొక్కారు.

ఇప్పటికీ రైతుల భూములు నిషేధిత జాబితాలోనే..

తాము సూచించిన ధరకు భూములు అమ్మలేదనే అక్కసుతో నాటి మంత్రులు, జాయింట్ కలెక్టర్ కలిసి 445.75 ఎకరాలను నిషేధ జాబితాలో చేర్చారు. ఎటువంటి లావాదేవీలు జరపకూడదని అప్పటి ఆర్డీవో మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. 86 సర్వే నెంబర్లలోని 445.75 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో పెట్టాలంటూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తరువాత ప్రాజెక్టు అటకెక్కడంతో తమ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలని చిన్న, సన్నకారు రైతులు పలుమార్లు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఆ భూములను నిషేధ జాబితా నుంచి తొలగించకుండా అప్పటి ఎమ్మెల్యే కొడాలి నాని అడ్డుకున్నారు. దీంతో రైతులు ఇప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

ఆ జాబితా నుంచి తొలగించండి : రైతులు

ఎంఐజీ ప్రాజెక్టు అటకెక్కడంతో తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రైతులు పలుమార్లు అప్పటి ఎమ్మెల్యే కొడాలి నాని, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాలను సమర్పించారు. అన్నీ బుట్టదాఖలయ్యాయి. నాలుగేళ్లుగా ఎటువంటి రుణాలు కానీ, ఆర్థిక లావాదేవీలు కానీ జరిపే ఆస్కారం లేకుండాపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో చిన్న, సన్నకారు రైతుల్లో ఆశలు చిగురించాయి. తమపై కక్షతో తమ భూములను నిషేధిత జాబితాలో పెట్టారని, వాటిని తొలగించి తమను ఆదుకోవాలని రైతులు అంగడాల సతీష్, అంగడాల వేణుగోపాలరావు, మెరుగుమాల ఝాన్సీలక్ష్మి, కొలుసు రామశాస్త్రి కోరుతున్నారు.

ఉచిత ఇసుక రేపటి నుంచే..

- పటిష్టంగా అమలు చేసేలా ప్రణాళిక
- అధికారులతో కలెక్టర్ బాలాజీ సమావేశం

మచిలీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. ఉచిత ఇసుక విధానం అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్.. కలెక్టర్లు, ఎస్పీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అద్నాన్‌నయీం అస్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా శాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి జిల్లాలో అమల్లోకి వస్తుందన్నారు. భూగర్భ గనులు, జలవనరులు, ఎస్ఈబీ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి, ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం సూచించిన విధివిధానాలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక పాయింట్ల నుంచి వినియోగదారులు ఇసుకను కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. రేవుల్లో అనధికార ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాపై



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ

దృష్టిసారించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలని ఎస్ఈబీ అధికారులకు కలెక్టర్ సూచించారు. రీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, అక్రమ మైనింగ్‌ను అరికట్టాలన్నారు. ఇసుకను ఉచితంగానే ఇస్తామని, లోడింగ్, రవాణా చార్జీలు వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జేసీ గీతాంజలిశర్మ, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, కృష్ణా రివర్ కన్జర్వేటర్ పీవీఆర్ కృష్ణారావు, గనులశాఖ ఎండీ ప్రతాప్‌రెడ్డి, డీపీవో నాగేశ్వరనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆరోగ్యానికి 'పెట్'బడి

ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జిల్లావ్యాప్తంగా పశు వైద్యశాలల్లో శనివారం పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. రకరకాల జాతి కుక్కలతో పాటు ముద్దులొలికే పెంపుడు పెట్స్ అందరినీ ఆకట్టుకున్నాయి.


ఎమ్మెల్యేగా నేను...

తన మార్కు అభివృద్ధివైపు యార్లగడ్డ పయనం

ఎన్నికల హామీలను నెరవేర్చే దిశగా గన్నవరంలో అడుగులు

- తొలుత అశోక్ లేల్యాండ్ పునఃప్రారంభంపై దృష్టి
- మల్లవల్లి పారిశ్రామికవాడకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి
- నియోజకవర్గ యువతకు ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యం
- సాగునీటి కోసం రూ1.10 కోట్లతో మోటార్లు
- సొంత డబ్బు పెట్టేందుకు సైతం సిద్ధం

తాను మాటలకే పరిమితమైన రాజకీయ నాయకుడిని కాదని, చేతల మనిషినని నిరూపించుకుంటున్నారు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు. ఎమ్మెల్యేగా గెలిచిన క్షణం నుంచి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారిస్తూ తనదైన మార్కు చూపిస్తున్నారు.



నియోజకవర్గ మ్యాప్‌ను పరిశీలిస్తూ అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గన్నవరంలో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించవచ్చని, కనీసం 15 వేల మంది నియోజకవర్గ యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని ఎన్నికల సమయంలోనే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కార్యాచరణ ప్రారంభించారు. తొలుత మల్లవల్లి పారిశ్రామికవాడపై దృష్టి సారించారు. వైసీపీ హయాంలో ఈ పారిశ్రామికవాడ కళ తప్పింది. ఇక్కడ ప్రధాన సమస్యలను గాలికొదిలేయడంతో పారిశ్రామికవేత్తలు ఇటువైపు చూడటానికి కూడా ఇష్టపడలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉత్పత్తి ప్రారంభించిన అశోక్ లేల్యాండ్ వంటి కంపెనీలు సైతం మూతపడ్డాయి. దీంతో వెంకట్రావు ముందుగా మల్లవల్లిపై దృష్టిపెట్టారు. అశోక్ లేల్యాండ్ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపారు. కంపెనీ తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తానన్నారు. దీంతో ఆగస్టు నుంచి తిరిగి ఉత్పత్తి ప్రారంభించేందుకు అశోక్ లేల్యాండ్ సిద్ధమవుతోంది.

భూముల ధరలపై దృష్టి

అనంతరం మల్లవల్లి పారిశ్రామిక కారిడార్‌లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే దృష్టిపెట్టారు. ఇక్కడ భూముల ధరలు బయట కంటే రెట్టింపు ధరలు పలుకుతుండటం, ఇతర సమస్యలను ఇటీవల 30 మంది పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యేకు వివరించారు. ఆ సమస్యలను పరిష్కరించే దిశగా యార్లగడ్డ కృషి చేస్తున్నారు. గతంలో టీడీపీ హయాంలో ఎకరా రూ.16 లక్షలకు, ఆ తర్వాత రూ.35 లక్షలకు పెరిగింది. వైసీపీ వచ్చాక అడ్డగోలుగా - మిగతా 8లో



కటౌట్.. సెంచరీ నాటౌట్

ధోనీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు నందిగామ మండలంలోని అంబారుపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన 100 అడుగుల కటౌట్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివారం కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.





అమ్మవారికి ఆషాఢ సారె తీసుకొచ్చిన మహిళలు

ఆషాఢ మహోత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు తొలి సారె సమర్పించిన ఆలయ వైదిక, పరిపాలన సిబ్బంది

- తొలిరోజు సారె సమర్పణలో పాల్గొన్న 1650మంది భక్తులు

వన్‌టౌన్, జూలై 6: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక ఆషాఢ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, వేద ఘోష, భక్తుల కోలాహలం మధ్య దుర్గమ్మకు సారె సమర్పణలు ప్రారంభమయ్యాయి. ఆలయ వైదిక సిబ్బంది, పరిపాలన సిబ్బంది కుటుంబసభ్యులతో కలిసి ఆషాఢమాస తొలి సారెను సమర్పించారు. కనకదుర్గానగర్ నుంచి సుగంధ పరిమళద్రవ్యాలు, పసుపుకుంకుమలు, గాజులు, చీరలు, పండ్లు, తీపిపదార్థాలను పళ్లాల్లో పెట్టుకుని ఊరేగింపుగా సారెను తీసుకుని ఇంద్రకీలాద్రిపైకి చేరుకున్నారు. ఈవో కేఎస్ రామారావు, దేవస్థానం స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ముఖ్య అర్చకులు శ్రీనివాసశాస్త్రి, శంకర శాండిల్య, యజ్ఞనారాయణ సారె సమర్పణలో పాల్గొన్నారు. మహామండపం ఆరో అంతస్థులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి పూజలు చేశారు. తొలిరోజు మొత్తం 1650 మంది భక్తులు సారె సమర్పణలో పాల్గొన్నారు. ప్రసాద పంపిణీని ఈవో రామారావు పరిశీలించారు.

వారాహి నవరాత్రులు ప్రారంభం

ఆషాఢం సందర్భంగా ఆలయంలో వారాహి నవరాత్రులు ప్రారంభించారు. నవరాత్రులను అంతర్గతంగా అర్చక బృందమే 15వ తేదీ వరకు నిర్వహిస్తోంది.

పట్టుచీరలకు జీఆర్ కోడ్ రశీదులు

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణలలో వచ్చే పట్టుచీరలకు ఈ ఏడాది నుంచి ప్రత్యేకంగా జీఆర్ కోడ్ రశీదును ఇస్తున్నారు. కార్యక్రమాన్ని అమ్మవారి దర్శనానికి వచ్చిన దేవదాయ కమిషనర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సత్యనారాయణ ప్రారంభించారు. భక్తులు తెచ్చిన పట్టుచీరలకు ఈవో కేఎస్ రామారావు జీఆర్ కోడ్ రశీదులను అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న శివస్వామి

దుర్గమ్మను తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ కుటుంబసభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఈవో తదితరులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. గ్రంథరచయిత పురాణపండ శ్రీనివాస్ రాసిన మంత్రపేటిక పుస్తకాన్ని ధర్మపథం వేదికపై వీణాత్రయం కచేరీకి ముందు వీణాత్రయంతో కలిసి ఈవో రామారావు ఆవిష్కరించారు. వారాహి నవరాత్రుల్లో విశేషార్చనలు చేసే ముత్తైదువలకు గ్రంథాన్ని ఉచితంగా ఇస్తామని తెలిపారు.

విరాళాల సేకరణకు కౌంటర్ ఏర్పాటు చేయాలి

దేవస్థానంలో ఆషాఢసారెలు స్వీకరించే మహామండపం ఆరో అంతస్థులో విరాళాల సేకరణకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. సారె స్వీకరణ సమయంలో దేవస్థానం సిబ్బందిని విరాళాలు తీసుకోమని అడిగితే కొండపైన ఉన్న ఆర్జిత సేవా కేంద్రంలోకి వెళ్లాలని చెబుతున్నారని దీంతో అక్కడకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు.







పూజల్లో పాల్గొన్న భక్తులు

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

- నియంత్రణకు కఠిన చట్టాల అమలు: మంత్రి సత్యకుమార్

లబ్బీపేట, జూలై 6: మాదక ద్రవ్యాలను కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేస్తోందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. జగన్నాథ రథయాత్ర-2024 సందర్భంగా ఇస్కాన్ విజయవాడ, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వ్యసన వ్యతిరేక వాకథాన్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకథాన్‌ను ప్రారంభించిన మంత్రి మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన, వ్యసన రహిత జీవన శైలిని ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇస్కాన్ సంస్థ మాదక ద్రవ్యాల నిర్మూలనతో పాటు యువతకు డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వాకథాన్ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి వీఎంపీ మాల్, నిర్మల కాన్వెంట్, ఆర్ఆర్ దర్బార్ మీదుగా తిరిగి స్టేడియానికి చేరుకుంది. ఇస్కాన్ అధ్యక్షుడు చక్రధారిదాస్, సభ్యులు పాల్గొన్నారు.



వాకథాన్‌లో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

వాసుదేవరెడ్డి, కొడాలి నాని, మాధవీలతారెడ్డిపై కేసు

- తన తల్లి మరణానికి కారణమయ్యారని గుడివాడవాసి దుగ్గిరాల ప్రభాకర్ ఫిర్యాదు

గుడివాడ: తన తల్లి మరణానికి రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, కృష్ణాజిల్లా పూర్వ జాయింట్ కలెక్టర్ మాధవీలతారెడ్డి కారణమయ్యారని గుడివాడ ఆటోనగర్‌కు చెందిన దుగ్గిరాల ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదుపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. తన తల్లి మరణానికి కారణమయ్యారని, కొడాలి నాని అనుచరులు బెదిరించారని, తన గోడౌన్‌లోని మద్యం కేసులను పగులగొట్టి, తగలబెట్టారని గతంలో తాను ఫిర్యాదు చేస్తే అప్పుడు పోలీసులు కేసు నమోదు చేయలేదని దుగ్గిరాల ప్రభాకర్ ప్రభాకర్ తెలిపారు. గోడౌన్ అక్రమ తరలింపును ప్రశ్నించినందుకు తన తల్లి సీతామహాలక్ష్మిని ఆనాటి బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, అప్పటి కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ మాధవీలతారెడ్డి, కొడాలి నాని తీవ్రంగా దుర్భాషలాడారని, దీంతో మనస్థాపానికి గురై ఆమె మృతి చెందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేస్తే సాక్ష్యాధారాలతో రావాలని పోలీసులు ఆదేశించారని తెలిసింది. పూర్తి సాక్ష్యాధారాలను సమర్పించడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న దుగ్గిరాల ప్రభాకర్

వైసీపీ నేతలు బెదిరిస్తున్నారు..రక్షణ కల్పించండి: దుగ్గిరాల

"నాకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయిస్తే, వైసీపీ నేతలు పేర్లు ఎందుకు పెట్టావంటూ రాత్రంతా ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులతో నాకు ప్రాణ భయం పట్టుకుంది. వారి నుంచి రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాస్తా. వారి దృష్టికి సమస్యను తీసుకెళ్తా." అని దుగ్గిరాల ప్రభాకర్ విలేకరులకు తెలిపారు.

ఇరురాష్ట్రాల సీఎంల సమావేశంపై

జగన్ రెడ్డి పెడబొబ్బలు: దేవినేని ఉమా


గొల్లపూడి, జూలై 6: దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర సమస్యలు, పునర్విభజన చట్టంలోని అంశాలపై ఇరురాష్ట్రాల సీఎంలు సమావేశమైతే మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పులివెందులలో పెడబొబ్బలు పెడుతున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం గొల్లపూడిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శిశుపాలుడిలా వైసీపీ నూరు తప్పులు చేయబట్టే ప్రజలు ఓటు అనే ఆయుధంతో శిరచ్ఛేదం చేశారన్నారు. బొత్స సత్యనారాయణ, పేర్ని నాని చిలకపలుకులు పలుకుతూ, పరాచికాలు ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీ చేసిన పాపాలు, అవినీతి బట్టబయలవుతోందన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించడానికి నెల్లూరు వెళ్లి మా పిన్నెల్లి మంచోడు ఈవీఎంలు పగలగొడితే తప్పేంటి అంటావా? నీ పరిజ్ఞానం, మానసిక పరిస్థితి ఎలా ఉందో ప్రజలకు అర్థమైంది కానీ సోకాలు ఆపు జగన్‌రెడ్డీ మందులు సకాలంలో వేసుకుంటే మానసికస్థితి సరిగ్గా ఉంటుందని ఆయన హితవు పలికారు.

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.1.64 కోట్లు

పెనుగంచిప్రోలు, జూలై 6: తిరుపతమ్మ దేవస్థానంలో హుండీలను శనివారం తెరిచి లెక్కించగా రూ.1,64,77,583 నగదు, 83 గ్రాముల మిశ్రమ బంగారం, కేజీ 850 గ్రాముల మిశ్రమ వెండి ఆదాయంగా సమకూరాయని ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడు తెలిపారు. 97 రోజులకు భక్తులు సమర్పించిన కానుకలని ఆయన పేర్కొన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ వాసు, ధర్మకర్తలు, కార్యాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సైపై తాగుబోతు దాడి

రెడ్డిగూడెం, జూలై 6: రెడ్డిగూడెం ఎస్సై యు.గోవింద్‌పై రంగాపురం గ్రామానికి చెందిన విస్సంపల్లి సాల్మన్ మద్యం మత్తులో దాడికి పాల్పడ్డాడు. ఈదాడిలో ఎస్సై తలపై స్వల్ప గాయమైంది. శనివారం రాత్రి పోలీసులు కుదప రోడ్డులోకి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలకు వెళ్లారు. ఆ సమయంలో బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న సాల్మన్‌ను పోలీసులు ప్రశ్నించారు. అతను వారిని ప్రతిఘటించి తిరగబడ్డాడు. దీంతో మరింత బలగంతో వచ్చి పోలీసులు అతడ్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ లోపల అతనికి ఎస్సై గోవింద్ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తుండగా అతను అక్కడున్న కర్రతో ఎస్సై తలపై బలంగా మోదాడు. ఈఘటనపై కేసు నమోదు చేశారు. సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ వైద్యుని వద్ద ఎస్సై చికిత్స చేయించుకున్నాడు.



తలపైన గాయానికి చికిత్స చేయించుకుంటున్న ఎస్సై యు.గోవింద్

పారదర్శకంగా ఉచిత ఇసుక విధానం

ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేయనున్న స్టాక్‌యార్డులు

- వినియోగదారుడికి రోజుకు గరిష్ఠంగా 20 మెట్రిక్ టన్నులు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎన్టీఆర్ జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 6: "రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేయాలి. అందుకు మైన్స్ అండ్ జియాలజీ, ఇరిగేషన్, రవాణా, పొల్యూషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, సెబ్ అధికారులు సమన్వయంతో పని చేయాలి." అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఉచిత ఇసుక విధానంపై అధికారులతో కలెక్టర్ సృజన శనివారం టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ఉచిత ఇసుక విధానాన్ని సజావుగా అమలుచేసేందుకు అధికారులకు ఆమె దిశానిర్దేశం చేశారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్‌యార్డులు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని, మొదట వచ్చిన వారికి మొదట ప్రాతిపదికన వినియోగదారులకు ఇసుకను సరఫరా చేయాలని సూచించారు. వినియోగదారులే సొంతంగా వాహనాన్ని సమకూర్చుకోవాలన్నారు. ఇసుక తవ్వకం, లోడింగ్, స్టాక్‌యార్డుకు రవాణా, ర్యాంపు నిర్వహణ, చట్టబద్ధ పన్నులు, లెవీలకు మాత్రమే నామమాత్రంగా వినియోగదారుల నుంచి వసూలు చేయాలని, ఇందులో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని, నేరుగా జిల్లా, మండల పరిషత్‌లు, పంచాయితీలకు వెళ్తుందని తెలిపారు. స్టాక్‌యార్డులో అందుబాటులో ఉన్న ఇసుక వివరాలు డీఎంజీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పర్యావరణ నియంత్రణలు, మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వాయర్లలో పూడిక రూపంలో ఉన్న ఇసుకను వెలికితీసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనధికార రవాణా చేస్తే చర్యలు

అవసరమైన దానికంటే ఎక్కువగా ఇసుకను నిల్వ చేసినా, రీసేల్ చేసినా, ఇతర రాష్ట్రాలకు అనధికార రవాణా చేసినా, భవన నిర్మాణానికి కాకుండా ఫిల్లింగ్ లేదా ఇతర ప్రయోజనాలకు ఉపయోగించినా క్రిమినల్ కేసులు లేదా అధిక జరిమానాలు, కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సృజన హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై పోలీస్, సెబ్ విభాగాలతో సమన్వయం చేసుకొంటూ గట్టి నిఘా పెట్టాలని ఆదేశించారు. టెలికాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఏడీ కె.రామస్వామి, విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్, నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు, తిరువూరు ఆర్డీవో కె.మాధవి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.


స్టాక్ యార్డు వద్ద

ధరలు ప్రదర్శించాలి

వీఆర్వో, వీఆర్ఏ, గ్రామ, వార్డు సచివాలయ అధికారులతో ప్రతి స్టాక్‌యార్డ్‌కు ఇన్‌చార్జిలను నియమించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమరాలతో నిఘా ఉంచాలన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ(డీఎల్ఎస్‌సీ) నిర్ణయించిన ధరలను యార్డుల వద్ద ప్రదర్శించాలని, వినియోగదారుల నుంచి డిజిటల్ చెల్లింపులు మాత్రమే స్వీకరించాలని, తప్పనిసరిగా పేమెంట్ రశీదు ఇవ్వాలని సూచించారు. వినియోగదారుడికి రోజుకు గరిష్ఠంగా 20 మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. డిమాండ్, సరఫరాకు అనుగుణంగా ఈ పరిమితిపై డీఎల్ఎస్‌సీ ఎప్పటికప్పుడు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వినియోగదారుడు ఆధార్ నంబర్, మొబైల్ నెంబర్, ఇసుక డెలివరీ చిరునామా, వాహనం నంబరును ఇవ్వాలని ఆమె సూచించారు. ఫస్ట్, సెకండ్, థర్డ్ ఆర్డర్ నదీ ప్రవాహాల నుంచి ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజల సొంత అవసరాలకు, కమ్యూనిటీ పనులకు ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లచ్చని తెలిపారు. అదీ యాంత్రిక పద్ధతుల్లో కాకుండా మాన్యువల్ పద్ధతుల్లో మాత్రమే ఇసుకను వెలికితీయాలని కలెక్టర్ స్పష్టంచేశారు.

ఇదీ తేడా!





వైసీపీ ప్రభుత్వంలో కొత్త బైపాస్ రోడ్డు గోతుల్లో ఇరుక్కున్న లారీ, లోడు లారీని బయటకు లాగుతున్న యంత్రం



టీడీపీ కూటమి ప్రభుత్వమొచ్చాక గోతులు పూడుస్తూ మరమ్మతులు చేస్తున్న యంత్రం

వైసీపీ పాలనలో..

ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల మరమ్మతులకు చిల్లిగవ్వ కూడా విదల్చలేదు. పట్టణంలోని కొత్త బైపాస్ రోడ్డు అధ్వానంగా ఉండేది. రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండటంతో ట్రాఫిక్‌ను కొత్త బైపాస్ రోడ్డుకు మరల్చారు. దీంతో రహదారి మరింత ఛిద్రమై గుంతలు పెద్దవిగా మారాయి. దీంతో లారీలు, బస్సులు వెళ్లేందుకు కూడా అనువుగా ఉండేది కాదు. ప్రమాదాల బారిన పడి పలువురు ద్విచక్రవాహనదారులు ఆస్పత్రి పాలైన ఘటనలు కోకొల్లలున్నాయి.

టీడీపీ కూటమి ప్రభుత్వమొచ్చాక..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే రాష్ట్రంలోని రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో కొత్త బైపాస్ రోడ్డులోని గుంతలకు మోక్షం కలిగింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చొరవతో ఆర్ అండ్ బీ అధికారులు రహదారికి మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహనదారులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

- గుడివాడ

కిడ్నీ వ్యాధితో వ్యవసాయకూలీ మృతి

ఎ.కొండూరు, జూలై 6: మండలంలోని చీమలపాడు గ్రామానికి చెందిన వ్యవసాయకూలీ కొంగల రవి కుమార్(32) కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. రవికుమార్ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యుల సలహాతో మందులు వాడుతున్నాడు. ఇటీవల వ్యాధి తీవ్రత పెరిగి సీరం క్రియాటిన్ 10 శాతానికి చేరింది. దీంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఒక్కసారిగా వ్యాధి తీవ్రత పెరగడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని తిరువూరు జనసేన ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు, సీపీఎం నేత ఆనందరావు ప్రభుత్వాన్ని కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలల్లో

ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్

భారతీనగర్: ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శనివారం ఏపీఈఏపీ సెట్-2024 కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్‌సీసీ కేటగిరిలో 377 మంది, క్రీడా విభాగంలో 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారంతా సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకున్నట్లు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి తెలిపారు

ఎమ్మెల్యేగా నేను...

(ఏడో పేజీ తరువాయి)

ఎకరా ధరను రూ.80 లక్షలకు పెంచేయడంతో పారిశ్రామికవేత్తలు ఇక్కడికి వచ్చేందుకు విముఖత చూపించారు. ఈ సమస్యలన్నింటినీ గాడినపెట్టి పారిశ్రామిక వాడలో పరిశ్రమల కళ తీసుకొచ్చేందుకు వెంకట్రావు కృషి చేస్తున్నారు.

రైతుల కోసం రూ.కోటి

బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల్లోని మెట్ట గ్రామాలకు గతంలో నాగార్జున సాగర్ కాల్వల ద్వారా సాగునీరు అందేది. పోలవరం కుడికాల్వ తవ్వకంతో నియోజకవర్గంలోని మెట్ట గ్రామాల భూములకు సాగునీరు చేరడం లేదు. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని 12,570 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లేకుండాపోయింది. ఈ సాగునీటి ఇబ్బందులు తొలగాలంటే పోలవరం కాల్వపై మోటార్లు ఏర్పాటు చేయాలి. బాపులపాడులో 57 మోటార్లు, గన్నవరం మండలంలో 63 మోటార్లు, విజయవాడ రూరల్ మండలంలో ఏడు మోటార్లు ఏర్పాటు చేయాలి. కాగా, గన్నవరం మండలంలో నాలుగు చోట్ల రెగ్యులేటర్ నిర్మాణం జరిగింది. వాటికి అనుసంధానంగా కాల్వల తవ్వకం పనులు చేపట్టాల్సి ఉంది. మొత్తం మీద ఈ పనులకు రూ.1.10 కోట్లు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించారు. వీటిని ప్రభుత్వం నుంచి తీసుకు రావాలని ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. కానిపక్షంలో సొంత నిధులతో మోటార్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఉద్యోగులకు భరోసా

ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి వివిధ శాఖల ఉద్యోగులతో ఎమ్మెల్యే వరుస సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేయాలని ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తున్నారు. శుక్రవారం విద్యాశాఖ సమీక్షలో ఆసక్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. గత ఎమ్మెల్యే హయాంలో తాము బిక్కుబిక్కుమంటూ ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి ఉండేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంకట్రావు స్పందిస్తూ ఉద్యోగులు ఎవరైనా నిర్భీతిగా విధులు చేసుకోవచ్చని, ప్రజలను దృష్టిలో పెట్టుకుని మానవీయకోణంతో విధులు నిర్వహించాలని సూచించారు.

అట్టహాసంగా యార్లగడ్డ విజయోత్సవ ర్యాలీ

ఉంగుటూరు/గుణదల, జూలై 6: గన్నవరం ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన యార్లగడ్డ వెంకట్రావు విజయోత్సవ యాత్ర శనివారం సాయంత్రం విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రింగ్ నుంచి అట్టహాసంగా ప్రారంభమైంది. రింగ్ వద్ద మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి యార్లగడ్డ నివాళులర్పించారు. అనంతరం కార్లు, బైక్‌లపై పెద్దసంఖ్యలో తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు యార్లగడ్డ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తుండగా ఓపెన్‌టాప్ వాహనంపై నుంచి ప్రజలకు యార్లగడ్డ అభివాదం చేస్తూ కిక్కిరిసిన జనసందోహం మధ్య ర్యాలీ రింగ్ నుంచి ముందుకు సాగింది. అక్కడి నుంచి ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి, కేసరపల్లి, గన్నవరం, చినఅవుటపల్లి, పెదఅవుటపల్లి, ఆత్కూరు, పొట్టిపాడు, తేలప్రోలు, అంపాపురం, వీరవల్లి గ్రామాల మీదుగా హనుమాన్‌జంక్షన్ వరకు జాతీయరహదారిపై ర్యాలీ దిగ్విజయంగా కొనసాగింది. తమ అభిమాన నాయకుడికి గ్రామగ్రామాన ప్రజలు, కార్యకర్తలు గజమాలలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులతో నీరాజనాలు పట్టారు. గన్నవరం చేరుకున్న విజయోత్సవ ర్యాలీకి పార్టీశ్రేణులు టపాసులు పేలుస్తూ, గజమాలలతో ఘనస్వాగతం పలికాయి. స్థానిక గాంధీబొమ్మసెంటర్లో ఎన్టీఆర్ విగ్రహానికి యార్లగడ్డ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయరహదారి మీదుగా యాత్ర ముందుకు సాగింది. పరిసర గ్రామాలనుంచి భారీగా తరలివచ్చిన ప్రజానీకంతోపాటు, ర్యాలీలోని వాహనశ్రేణితో జాతీయరహదారి కిక్కిరిసిపోయింది. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



రామవరప్పాడు రింగ్ సెంటర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు

వన్‌టౌన్, జూలై 6: అగ్నివీర్ పథకం ద్వారా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఉపాధి అధికారి బి.విక్టర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 శాతం మార్కులతో లెక్కలు, భౌతికశాస్త్రం, ఆంగ్లం సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్(10+2), సైన్స్, ఇతర సబ్జెక్టులతో ఇంటర్మీడియట్, ఇంటర్ ఒకేషనల్, మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్)ఉత్తీర్ణులై ఉండాలని, శారీరక దారుఢ్యం, వైద్య ప్రమాణాలు సరితూగాలని అగ్నిపథ్ వాయు.సీడీఏసీ.ఇన్ ఆన్ లైన్ లింక్ ద్వారా ఈనెల 8 నుంచి 28 వరకు మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ రాతపరీక్ష, ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఫిట్‌నెస్‌టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన చేసి ఎంపిక నిర్వహిస్తారని తెలిపారు.

కేడీసీసీబీలో అంతర్జాతీయ సహకార దినోత్సవం

మచిలీపట్నం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రైతులకు, ఖాతాదారులకు కేడీసీసీబీ ద్వారా అత్యుత్తమ సేవలందించాలని కేడీసీసీబీ సీఈవో శ్యాంమనోహర్ అన్నారు. మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంకులో 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సప్తవర్ణ సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. గ్రామీణ ప్రజల ఉజ్వల భవిష్యత్తు నిర్మాణం కోసం సహకార సంఘాలు ఏర్పాటయ్యాయయని, గ్రామీణులకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. రైతులకు సేవలందించడంతో సహకారసంఘాలు ముందంజలో ఉన్నాయన్నారు. సహకారసంఘాల్లో పనిచేసే ఉద్యోగులంతా సేవాభావంతో పని చేయాలని సూచించారు. ఉద్యోగులు, ఖాతాదారులతో ఆయన సహకార ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర సహకార యూనియన్ విద్యాధికారి కేబీ రంగరాజు అంతర్జాతీయ సహకార దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. బ్యాంక్ జీఎం బీఎల్ చంద్రశేఖర్, డీజీఎంలు పీజేఎస్ ప్రభాకర్, పి.వరలక్ష్మి, అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి కార్యాలయంలో డీసీవో కె.చంద్రశేఖరరెడ్డి సహకార పతాకాన్ని ఆవిష్కరించారు.



సహకార పతాకానికి వందనం చేస్తున్న కేడీసీసీబీ సీఈవో శ్యాంమనోహర్,ఉద్యోగులు

ఆక్సిజన్ ప్లాంట్‌కు బడ్జెట్ కేటాయింపులు లేవు

- జీజీహెచ్ అదనపు డైరెక్టర్, సూపరింటెండెంట్ వెంకటేష్

వన్‌టౌన్, జూలై 6: ప్రభుత్వాస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌కు ఎటువంటి బడ్జెట్ కేటాయింపులు లేవని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అదనపు డైరెక్టర్, సూపరింటెండెంట్ వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ నిర్వహణ తీరుపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఆక్సిజన్ ప్లాంట్‌ను అంటువ్యాధి, మహమ్మారులు విజృంభించినప్పుడే అత్యవసర ప్రయోజనాల కోసం వినియోగిస్తారని తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ కోసం డీఎంఈ ద్వారా బడ్జెట్ కేటాయిస్తారని దానిని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా వినియోగిస్తారని తెలిపారు. ఆక్సిజన్ సరఫరా కోసం రాష్ట్రస్థాయి టెండర్ పిలిచి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేశారని తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ పనిచేయడానికి చాలా పరికరాలు లేవని, 24 గంటలు సేవలందించడానికి ప్రత్యేక అర్హత కలిగిన సాంకేతిక సిబ్బంది లేరని వెంకటేష్ పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.45

పెదపులిపాకలో రుణ అర్హత కార్డుల పంపిణీ

పెనమలూరు, జూలై 6 : మండలంలోని పెద పులిపాకలో కౌలురైతులకు రుణ అర్హత కార్డులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ గుంటూరు శ్రీనివా సచౌదరి మాట్లాడుతూ, కౌలు రైతులు తప్పనిసరిగా రుణ అర్హత కార్డులను తీసుకొని ప్రభుత్వ సహాయం పొందాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో దేవప్రియుడు తదితరులు పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసచౌదరి

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

సచివాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



యనమలకుదురులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 6 : ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా సచివాలయాల్లో ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి తేనున్నట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. శనివారం యనమలకుదురు పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆయన మూడవ సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సచివాలయాలను ఊరికి దూరంగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండేట్లు చూసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసే ప్రక్రియలో భాగంగానే తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, వెలగపూడి బాబూరావు, మొక్కపాటి శ్రీనివాస్, అనంతనేని ఆజాద్, ముప్పవరపు నారాయణ, శొంఠి శివరాంప్రసాద్, తమ్మ అశోక్, గండికోట శ్రీను, పాదాల ప్రభాకర్, మాచిన శివ, బలగం నాగరాజు, షేక సత్తార్, భవినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కేసరపల్లిలో మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు

గన్నవరం(ఉంగుటూరు), జూలై 6 : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ అమ్మపేరిట ఒక మొక్క నాటి దానిని సంరక్షించడంద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడినవారవుతారని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కురుమద్దాలి ఫణికుమార్ అన్నారు. దేశప్రధాని నరేంద్రమోదీ తలపెట్టిన అమ్మ పేరిట మొక్క కార్యక్రమం శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఆ పార్టీ నేతలు కేసరపల్లిలో నిర్వహించారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో నేతలు మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫణికుమార్ మాట్లాడుతూ, అమ్మ పేరిట మొక్క నాటితే అమ్మకు ఎలా పోషణ, రక్షణ కల్పిస్తామో అదేవిధంగా మొక్కకు కూడా నీళ్లు పోసి సంరక్షించాలని, తద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎస్సీ కాలనీలో బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చందు, ప్రసాద్, నలగామరాజు, శ్యాంప్రసాద్, టీడీపీ నాయకులు పొట్లూరి బసవారావు పాల్గొన్నారు.

నంబరు ప్లేట్లులేని వాహనాలు సీజ్



నంబర్లు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై

ఉయ్యూరు, జూలై 6 : నంబరు ప్లేట్లపై నంబర్లులేని 11 ద్విచక్రవాహనాలను ఉయ్యూరు ఎస్సై గణేశ్‌కుమార్ శనివారం సీజ్ చేశారు. పట్టణంలో వాహనాల తనిఖీ చేస్తుండగా నంబరు ప్లేట్లు, నంబర్లు లేకుండా నడుపుతున్న ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని నడిపేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నంబర్లు లేకుండా వాహనాలు నడపడం నేరమని, నంబరు ప్లేట్లపై నంబర్లు కాకుండా ఏవేవో రాతలు ఉన్నా సీజ్‌చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


చిన్నారులకు న్యూట్రిషన్‌ఫుడ్ అవసరం



చిన్నారులకు న్యూట్రిషన్‌ఫుడ్ అందజేస్తున్న డాక్టర్ పవన్‌కళ్యాణ్

ఉయ్యూరు, జూలై 6 : చిన్న వయస్సు పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ ఎంతో అవసరమని ప్రముఖ పిల్లల వైద్యుడు పి.పవన్ కళ్యాణ్ అన్నారు. ఎంకే ఇంగ్లీషు మీడియం స్కూల్, ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం నిర్వహించిన హెల్త్ అండ్ న్యూట్రిషన్ క్యాంపులో ఆయన పాల్గొని పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్ అవసరాన్ని వివరించారు. స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు పాల్గొన్నారు.







కంకిపాడు.. నున్న.. కె.సీతారాంపురంలో జరిగిన జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ నేతలు.. గన్నవరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, జూలై 6 : దేశ ఉపప్రధాని, బడుగు బలహీన వర్గాల నాయకుడిగా బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ కీర్తించారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకుని ఉయ్యూరులో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 5వ వార్డు కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి, టీడీపీ నాయకులు జంపన శ్రీనివాసరావు, రాజులపాటి ఫణి, అజ్మతుల్లా, తేజ, తిరుపతిరావు, నరసింహారావు పాల్గొన్నారు.

పెనమలూరు : జగ్జీవన్‌రామ్ వర్ధంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని టీడీపీ నాయకులు నిర్వహించారు. కంకిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో మండల పార్టీ కార్యాలయ బాధ్యుడు బొప్పూడి శివరామకృష్ణ, పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, ఏనుగ జయప్రకాష్, షేక్ బాజి పాల్గొన్నారు. కోలవెన్నులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ చోరగూడి సురేష్, తుమ్మల జగదీష్, కళ్యాణి పాల్గొన్నారు.

విజయవాడ రూరల్ : నున్నలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం ఎమ్మార్పీఎస్ నున్న గ్రామ అధ్యక్షుడు తగరం సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మార్పీఎస్ నాయకుడు మందవేణు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేత కోటేశ్వరరావు, టీడీపీ నేత యార్కారెడ్డి కోటిరెడ్డి, వైసీపీ నేత నాగిరెడ్డి, కాటూరి శ్రీను, కలపాల అబ్రహం పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజేంద్రప్రసాద్

హనుమాన్‌జంక్షన్ రూరల్ : కె.సీతారాంపురంలో టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెన్నుబోయిన శివనాగరాజు, ప్రొద్దుటూరు గంగరాజు, గండేపూడి నితీష్‌కుమార్, కాండ్రు అజయ్, చౌటపల్లి భాగ్యరాజు, ఎనికేపల్లి శ్రీనివాసరావు, సాంబశివరావు, తంబి పాల్గొన్నారు.

గన్నవరం (ఉంగుటూరు) : జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న ఆయన విగ్రహానికి శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు రాచేటి మురళి పూలమాలవేసి నివాళులర్పించారు. నిడమర్తి నాగేశ్వరరావు, వనం నాగేశ్వరరావు, కలపాల బుల్లియ్య, విజయారావు పాల్గొన్నారు.

యువతపైనే దేశప్రగతి



విద్యార్థులకు డిగ్రీపట్టాలు ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూకే డైరెక్టర్ బాలకృష్ణ

ఉంగుటూరు, జూలై 6 : సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు యువతరంతోనే సాధ్యమని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో లక్ష్యసాధనకు కృషి చేయడం ద్వారా దేశప్రగతిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని జేఎన్‌టీయూకే డైరెక్టర్ ఆఫ్ ఇవాల్యుయేషన్ బాలకృష్ణ పిలుపునిచ్చారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన రెండవ గ్రాడ్యుయేషన్ డే (స్నాతకోత్సవం) వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యంతో కలిసి 442 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుంకర అనిల్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా తమ కళాశాలలో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కూడిన మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. తమ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ అటానమస్ హోదా లభించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం(ఉంగుటూరు), జూలై 6 : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్ 11కేవీ ఆర్టీసీ ఫీడర్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఎస్సీ కాలనీ, గ్యాస్ కంపెనీ, ఆర్టీసీ బస్టాండ్, విద్యానగర్, శ్రీనగర్‌కాలనీ, బుద్ధవరం రోడ్డు, గౌడపేట, ఎంపీడీవో ఆఫీస్, మదర్‌థెరిస్సా కాలనీ, సుబ్బారావునగర్, మల్లికార్జున స్కూల్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

జంతుప్రేమికులకు అవగాహన, అప్రమత్తత అవసరం



గన్నవరం బోధనాసుపత్రిలో కుక్కలకు యాంటీ రేబీస్ టీకా వేస్తున్న పశువైద్య కళాశాల డీన్ డాక్టర్ కిషోర్

గన్నవరం(ఉంగుటూరు), జూలై 6 : జంతుప్రేమికులకు అవగాహనతో కూడినఅప్రమత్తత అవసరమని గన్నవరం ఎన్టీఆర్ పశువైద్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీవీఎస్ కిషోర్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ పశువైద్యకళాశాల బోధనాసుపత్రిలో శనివారం జూనోటిక్ వ్యాధులపై పశుపోషకులు, జంతుప్రేమికులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో బోధనాసుపత్రి విభాగాధిపతి డాక్టర్ కామినేని సురేష్ మాట్లాడుతూ, జూనోసిస్ డే సందర్భంగా 158 పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ టీకాలు వేయడంతోపాటు పశువైద్యకళాశాల బోధనా సిబ్బందికి, బోధనేతర సిబ్బందికి, క్లినికల్ పీజీ విద్యార్థులకు యాంటీ రేబీస్ టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బిందుకిరణ్మయి, ప్రొఫెసర్లు డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.లక్ష్మీరాణి, డాక్టర్ వి.దేవీప్రసాద్, డాక్టర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : పెంపుడు కుక్కల సంరక్షణపట్ల జంతుప్రేమికులు జాగ్రత్తగా వుండాలని తేలప్రోలు ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రి పశువైద్యాధికారి డాక్టర్ చింతల మల్లిబాబు సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం మండల పరిధిలోని తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, ఇందుపల్లి ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రుల్లో 85 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు.







బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.45

విద్యుదాఘాతంతో పంచాయతీ కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ మృతి



ఘంటసాల : విద్యుత్ షాక్‌తో పంచాయతీ కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. దాలిపర్రు పంచాయతీలో కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న చొప్పర వెంకటేశ్వరరావు (53) శనివారం సాయంత్రం విద్యుత్ స్తంభం ఎక్కి వీధి లైట్లు వేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా విద్యుత్‌షాక్‌కు గురై స్తంభం మీద నుంచి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వరరావు మృతి చెందటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తున్న జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ

పోలవరం, పట్టిసీమలతో కృష్ణాడెల్టా సస్యశామలం

మచిలీపట్నం టౌన్, జూలై 6 : పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కృష్ణాడెల్టా సస్యశ్యామలవుతుందని, సాగు, తాగునీటికి ఇబ్బందులుండవని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. తెలుగురైతులతో కలిసి శనివారం ఆయన పోలవరం, పట్టిసీమ ఎత్తిపోతల పథకాలను సందర్శించారు. అనంతరం గోపు సత్యనారాయణ మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో పోలవరం నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని ఎంపీలు, మంత్రులు కేంద్రం నుంచి తీసుకురావాలన్నారు. తెలుగురైతులు తూమాటి బసవశంకరరావు, పామర్తి లక్ష్మణ్, వేముల శివాజీ, ఆళ్ల మాధవ, బడే రమణ, చల్లా సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



చల్లపల్లి : ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (రి.నెం.1104) ఉయ్యూరు డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక రామానగరంలోని శ్రీరాణీ భవానీదేవి కల్యాణ మండపంలో జరిగింది. డివిజన్ అధ్యక్షుడిగా ఎల్.అర్జునరావు, వర్కిం గ్ ప్రెసిడెంట్‌గా జి.రామ చంద్రశేఖర్, సెక్రటరీగా ఎస్‌డిఆర్.మోహన్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.సతీష్‌కుమార్, కోశాధికారిగా ఆర్.సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా ఏపీసీపీడీసీఎల్ డిస్కం ప్రెసిడెంట్ ఆర్.సంజీవరావు, కార్యదర్శి ఎస్.శర్మ, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రాఘవేంద్రరావు, రీజినల్ సెక్రటరీ జి.కమలాకరరావు, గౌరవ అతిథిగా ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు డి.కృష్ణానాయక్ పాల్గొన్నారు.

తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నింపేందుకు చర్యలు

మచిలీపట్నం టౌన్, జూలై 6 : ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశం మేరకు శనివారం ఆయన తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును సందర్శించి నీటి మట్టాన్ని పరిశీలించారు. 19 రిజర్వాయర్ల ద్వారా మచిలీపట్నం ప్రజలకు తాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ బాలాజీ ఆదేశాల మేరకు తాగునీటి పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అతిసార బారిన పడకుండా ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు పాటించాలి

గుడివాడ రూరల్ : అన్ని పంచాయతీల్లో తాగునీరు సరఫరా చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో కె.జ్యోతి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తాగునీరు, పారిశుధ్యం అంశాలపై సమీక్ష నిర్వహించారు. వాటర్ ట్యాంక్‌లను ప్రతి 15 రోజులకు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపర్చాలన్నారు. నీరు సరఫరా చేసేటప్పుడు బ్లీచింగ్, క్లోరిన్ సముపాళ్లలో కలపాలన్నారు. నీటి పరీక్షలు జరిపి, ట్యాంక్‌లకు సరఫరా చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈవోపీఆర్డీ డి.వెంకటేశ్వరరావు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మండలి, కుమార్ రాజా

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘననివాళి

గుడివాడ : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని పురస్కరించుకుని గుడ్‌మెన్‌పేటలో ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు కంచర్ల సుధాకర్, వేల్పుల నాగబాబు, వేశపోగు సుందరయ్య, అత్తాటి సాల్మన్, పైడిముక్కల వంశీ, కొదమల గంగాధర్, ఇంటూరి గజేంద్ర నివాళులర్పించారు. ప్రజావేదికలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. **అవనిగడ్డ :** జగ్జీవన్‌రామ్ విగ్రహానికి మండలి బుద్ధప్రసాద్ నివాళులర్పించారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సర్పంచ్ కృష్ణకుమారి, కార్యదర్శి పివి.మాధవేంద్రరావు నివాళుల ర్పించారు. రామానగరం దళితవాడ వద్ద కొక్కిలిగడ్డ నవీన్, కొడాలి ఏలియా నివాళులర్పించారు. **పెదపారుపూడి :** వెంట్రప్రగడ, చిన్నపారుపూడి, భూషణగుళ్లలో చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. **ఘంటసాల :** తెలుగురావుపాలెంలో సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. **నాగాయ లంక :** పెదపాలెం, నాగాయలంకలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు సర్పంచ్ దున్న రాజేష్, ఎమ్మార్పీఎస్ నేత తానంకి పోతురాజు నివాళులర్పించారు. **పామర్రు :** చాట్లవానిపురంలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే కుమార్ రాజా నివాళులర్పించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిలో కుమార్ రాజా పాల్గొన్నారు. ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, మంతెన రామాంజనేయులు, తాడిశెట్టి నరేష్, ఆర్.వెంకటేశ్వరరావు, కాటూరిశ్రీనివాసరావు, జువ్వనపూడి సురేంద్ర, చాట్లరమేష్ పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ నేత వీరంకి వెంకట గురుమూర్తి, నెక్కలపూడి మురళీ తదితరులు నివాళులర్పించారు.

అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలి

గుడ్లవల్లేరు : అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలని జగనన్న కాలనీ వాసులు శనివారం తహసీల్దార్ సునీల్‌కు వినతి పత్రం అందజేశారు. అంతర్గత రహదారుల, మౌలిక సదుపాయాలు లేనందున ఇబ్బందులు పడుతున్నామని :పేర్కొన్నారు



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కాగిత, మాట్లాడుతున్న టీడీపీ నేత బొడ్డు వేణుగోపాలరావు



పల్లోటి స్కూల్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కాగిత

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

పెడన రూరల్, జూలై 6 : ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలసి పెడన పురపాలక సంఘం ఉద్యోగులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పురపాలక సంఘం ఆదాయవనరుల వివరాలు, ఖర్చుల వివరాలను తెలిపారు. బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం పనుల్లో అవకతవకలను వివరించారు. ట్రాక్టర్‌కు ఏడాదికి రూ.11 లక్షల ఆయిల్ బిల్ రావటమేమిటని కౌన్సిలర్ మట్టా శివపావని అన్నారు. ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని యక్కల శ్యామలయ్య కోరారు. తామరచెరువులో గుర్రపుడెక్క తొలగించాలని మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం(హన్ను) కోరారు. మున్సిపల్ సంస్థకు ఆదాయవనరు లు పెంచుకుని అధికారులు పనులు చే యాలని కృష్ణప్రసాద్ అన్నారు. డీఈ రాంప్రసాద్, మేనేజర్ నాగేశ్వరరావు, టీపీఎస్ ఏసుబాబు, సుందరం, రహమాన్‌బేగ్, వాహబ్‌ఖాన్, నాగరాజు, శివ పాల్గొన్నారు.

కౌన్సిలర్లు నారాయణరావు, శేషుబాబు మృతికి బందరు కౌన్సిల్ సంతాపం

మచిలీపట్నం టౌన్ : మాజీ కౌన్సిలర్లు ఆకునూరి నారాయణరావు, మోదుమూడి శేషుబాబు మృతికి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం సంతాపం తెలిపింది. నగర కౌన్సిల్ సమావేశం శనివారం మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమేవేశంలో ఇటీవల మృతి చెందిన ఆకునూరి నారాయణరావు, మోదుమూడి శేషుబాబు మృతికి సంతాపం తెలిపి, ఎజెండాల అంశాలను ప్రవేశపెట్టకుండా అనంతరం సమావేశాన్ని వాయిదా వేశారు. శేషుబాబు కుటుంబ సభ్యులకు మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా జీ+3 ఇంటి తాళాలు ఇవ్వాలని కౌన్సిలర్ నాగరాము అన్నారు. వైసీపీ కార్పొరేటర్ పరింకాయల విజయ్ దీనిని సమర్థించారు. కమిషనరు బాపిరాజు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందాలి

పెడన : పాఠశాల స్థాయి నుంచే సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు అలవడతాయని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. సెయింట్ విన్సెంట్ పల్లోటి స్కూల్‌లో శనివారం స్కూల్ పార్లమెంటు ఇన్‌స్టలేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డే నిర్వహించారు. కృష్ణప్రసాద్ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కరస్పాండెంట్ జోజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఏకాగ్రత, పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. కృష్ణప్రసాద్‌కు స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనసన్మానం జరిగింది. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రాజీవ్, అర్జా వెంకట నగేష్, అబ్దుల్ ఖయూం (హన్ను), యక్కల శ్యామలయ్య, రూరల్ శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : కుమార్‌రాజా

పామర్రు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పట్ల ప్రజల్ని చైతన్యవంతం ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. బల్లిపర్రులో శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాంటీ డయేరియా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంఈవో గుమ్మడి పద్మవాణి, సర్పంచ్ సుధాకర్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుమార్‌రాజాకు వైవీబీ అభినందనలు

పామర్రు : పామర్రు ఎమ్మెలే వర్లకుమార్ రాజాను మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.కుమార్ రాజా నేతృత్వంలో పామర్రు నియోజకవర్గం అభివృద్ధిపథంలో ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చికిత్సపొందుతూ ఉల్లిపాయల వ్యాపారి మృతి

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

బంటుమిల్లి : నారాయణపురం-పెదపట్నం రోడ్డులో శుక్రవారం రాత్రి ట్రక్కు ఆటో పల్టీ కొట్టి తీవ్రంగా గాయపడిన ఉల్లిపాయల వ్యాపారి చిగురుశెట్టి సుభాష్‌చంద్రబోస్ (42) చికిత్స పొందుతూ శనివారం ఉదయం విజయవాడలో మృతి చెందాడు. ముల్లపర్రు గ్రామానికి చెందిన సుభాష్‌చంద్రబోస్ జానకి రామాపురంలో నివాసముంటూ ఆటోలో ఉల్లిపాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఉల్లిపాయలు వేసుకుని వెళ్తుండగా ఆటో పంట పొలాల్లో బోల్తా కొట్టింది. అపస్మారక స్థితికి చేరిన అతడిని 108లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సుభాష్‌చంద్రబోస్ శనివారం ఉదయం మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాదం జరిగిన చోట రక్తంతో కూడిన స్టీల్ గాలి పంపు ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి చంపి రోడ్డు పక్కన పొలంలో పడేసినట్లుగా భావించిన పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ ఎండి అబ్దుల్ సుభాన్, సీఐ నాగేంద్రప్రసాద్, బంటుమిల్లి ఎస్సై వాసు, గూడూరు ఎస్సై వీరరాజు సందర్శించారు. మచిలీపట్నం నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు బృందాలు హత్య కేసుగా భావించి దర్యాప్తు చేస్తున్నాయి.

మద్యం లోడు మినీ వ్యాన్ బోల్తా

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నుంచి చల్లపల్లికి మద్యం సీసాలు తీసుకుని వెళుతున్న మినీ వ్యాన్ కొత్తబైపాస్ రోడ్డులో శనివారం బోల్తా పడింది. దీంతో రూ. 4 లక్షల 22 వేల విలువైన మద్యం సీసాలు ధ్వంసమయ్యాయి. గుడివాడ నుంచి బయలుదేరిన మినీ వ్యాన్ అవనిగడ్డ, నాగాయలంకలోని ప్రభుత్వ వైన్ షాపులకు మద్యం తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఎక్సైజ్ అధికారులు, రూరల్ ఎస్సై పద్మ సందర్శించారు

వృద్ధాశ్రమానికి జనసేన రూ. లక్ష విరాళం

మచిలీపట్నం టౌన్ : సుకర్లాబాద్‌లోని స్నేహాలయ వృద్ధాశ్రమం మరమ్మతులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. వృద్ధాశ్రమాన్ని శనివారం ఆయన సందర్శించి వృద్ధులకు అవసరమైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్



మచిలీపట్నం టౌన్ : జునోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ శిబిరాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు గోపీచంద్ ప్రారంభించారు. కుక్కలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. నాగభూషణం, డాక్టర్ రమణయ్య, ఫణికుమార్, భాను, రాంబాబు, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు. **బంటుమిల్లి :** కుక్కలకు ఉచితంగా యాంటీ రాబీస్ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శనివారం ప్రారంభించారు. డాక్టర్ స్ఫూర్తి ఆధ్వర్యంలో 124 కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలు వేశారు. డాక్టర్ ఎల్.రాజీవ్ నాయక్, సుష్మంత్, రాజీవ్, త్రినాథ్ పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు :** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెగ్రాం పశువుల సంత కార్యదర్శి ఈడుపుగంటి ఉమా మహేశ్వరరావు వ్యాక్సినేషన్ శిబిరాన్ని ప్రారంభించారు. 176 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు అధ్యక్షురాలు ఎస్.శశికళ తెలిపారు. **పెదపారుపూడి :** పెదపారుపూడి, యలమర్రు పశువైద్యశాలల్లో డాక్టర్ డి.శ్రీనివాసరావు కుక్కలకు టీకాలను ఉచితంగా వేశారు. సర్పంచ్‌లు సమీరా, కె.అనూష, డాక్టర్ జి.వి.నరసింహారావు, జయంత్, కిషోర్ పాల్గొన్నారు. **మోపిదేవి :** డాక్టర్ ఎం.నందకిషోర్‌పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ మేరీరాణి పాల్గొన్నారు. **చల్లపల్లి :** పశుసంవర్ధకశాఖ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నల్లూరి వెంకట భార్గవ చల్లపల్లి పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైద్యులు పాల్గొన్నారు.

సాధారణ బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజలకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా, CNR ఆర్కా ఎంటర్‌ప్రైజెస్ మరియు దాని యజమాని శ్రీ బల్లె జయరాజు, S/o గంటయ్య, వయస్సు సుమారు 41 సంవత్సరాలు, నివాసం : డి.నం.6-194/1, మోడీ గ్రామం, కాళ్ల మండలం, కాలవపూడి, పశ్చిమ గోదావరి, ఆంధ్రప్రదేశ్-534201 వారు **రూ.5,13,46,130/- (అక్షరాల ఐదు కోట్ల పదమూడు లక్షల నలభై అరు వేల నూట ముప్పై రూపాయలు మాత్రమే)** లకు వ్యతిరేకంగా మా క్లైంటు తీర్పు పొందిన కారణంగా, గౌరవనీయులైన 34వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్, బెంగుళూరు, మేయో హాల్ యూనిట్, శ్రీ బల్లె జయరాజుకు వ్యతిరేకంగా అరెస్టు వారెంట్‌లను కూడా జారీ చేసింది. ఏ వ్యక్తి అయినా తన స్థానం మరియు ఆచూకీ గురించి అవగాహన కలిగి ఉన్నట్లయితే, దిగువ సంతకం చేసిన వ్యక్తికి వీలైనంత త్వరగా తెలియజేయవలసి ఉంటుంది. పై తీర్పు అనుగుణంగా శ్రీ బల్లె జయరాజుకు చెందిన ఏదైనా ఆస్తి దిగువ సంతకం చేసిన వారికి తెలియజేయవలసిందిగా మేము సాధారణ ప్రజలను కూడా కోరుతున్నాము. సమాచారం ఇచ్చేవారికి తగిన రివార్డు ఉంటుంది.

శ్రీ గంజల వెంకట నాగరాజు, తండ్రి : రామస్వామి, వయస్సు సుమారు 47 సంవత్సరాలు, నివాసం : డి.నెం.29/170-189-4ఎ, ఇనగూదూరుపేట, మచిలీపట్నం మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ వారు మా క్లయింట్‌కు అనుకూలంగా, టైటిల్ డీడ్ డిపాజిట్ ద్వారా, R.Sలో 2059 చదరపు గజాల (501.666 చ.గజాలు + 1577.333 చదరపు గజాలు) ఆస్తి సం.401, డి.సం.29/170-98, ఇనగూదూరుపేట, అమృతపురం, బాదరు తూర్పు, రెవెన్యూ వార్డ్ సం.1, మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో, మచిలీపట్నం SROలో, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఆస్తి నా క్లయింట్‌కు తనఖా పెట్టబడినందున దానికి సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరపకూడదని లేదా ఏ విధమైన లావాదేవీలు చేయవద్దని మేము సాధారణ ప్రజలను హెచ్చరిస్తున్నాము.

చిరునామా :
మెస్సర్స్ వెంకటేష్, అమర్‌నాథ్ & కో.,
న్యాయవాదులు,
నెం.432, 1వ అంతస్తు, 12వ క్రాస్,
సదాశివనగర్, బెంగుళూరు- 560 080
ఫోన్ : +91-9886140745, +91-9738129600